# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

సంపుటి : 3 సంచిక : 312 మంగళవారం 31 మార్చి 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com




## నక్సలిజం దాదాపు అంతమైంది

- మిగిలినవారు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందే
- నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను మార్చాం
- కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదు

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ




- దేశంలో రైతుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ కనీస మద్దతు ధర చట్టం తెచ్చిందన్న రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి
- పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి
- దొడ్డు బియ్యం తినేవారు లేక ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయింది

హైదరాబాద్

హైడ్రా, ఈగల్ తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో రైతుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కనీస మద్దతు ధర చట్టం తెచ్చిందని వెల్లడించారు. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వాళ్లను నియంత్రించడానికి ఆనాడు కాంగ్రెస్ పార్టీ పకడ్బందీ చట్టం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిందని కాకపోతే అది అంతగా ప్రజల్లోకి వెళ్లలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ తరువాత ఎన్టీరామారావు ఈ పథకాన్ని ముందుకు - మిగతా3లో



# గిగ్ వర్కర్స్ బిల్లుకు శాసనసభ ఆమోదం

- సెలెక్ట్ కమిటీకి 'హేట్ స్పీచ్ బిల్'
- ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారికి ప్రభుత్వం తరుపున సాయం అందించడం లాంటివి ఉన్నాయి
- ఈ బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదు.
- మతపరమైన విద్వేషాలను రెచ్చగొడితే చర్యలు

హైదరాబాద్

గిగ్ వర్కర్స్ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. శాసనసభలో గిగ్ వర్కర్స్ బిల్లుపై చర్చలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 'శాసనసభలో మంత్రి వివేక్ వెంకస్వామి గిగ్ వర్కర్స్ బిల్లును తేవడం సంతోషంగా ఉంది. మా నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రలో గిగ్ వర్కర్స్ తో సమావేశం నిర్వహించారు. లక్షల మంది గిగ్ వర్కర్లు ఈ బిల్లు కోసం ఎదురు చూస్తున్నారు. - మిగతా3లో



## సైనికులకు న్యాయం సులభంగా అందాలి

- వాళ్లు రెండు యుద్ధాలు చేసే పరిస్థితి తీసుకురావద్దు: సీజేఐ
- కేంద్రపాలిత ప్రాంతం లేహ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- ఈ క్రమంలో దేశ సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు
- సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలన్న సీజేఐ

## నామినేషన్లు దాఖలు చేసిన స్టాలిన్, విజయ్

- చెన్నైలోని కొలతూరు నియోజకవర్గం నుంచి మరోసారి పోటీకి సిద్ధమైన స్టాలిన్
- సోమవారం నామినేషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి
- టీవీకే అధినేత విజయ్ కూడా నామినేషన్ దాఖలు



# అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి

- గత దశాబ్ద కాలంలో అన్నీ మారిపోయాయ్
- అసోంలో బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడిన ప్రధాని మోదీ
- కాంగ్రెస్ దుష్పరిపాలన గురించి తొలిసారి ఓటు వేస్తున్న వారికి తెలియజేయాలని వెల్లడి
- 'రాష్ట్ర అభివృద్ధికి శాంతి పునాది'
- బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయి





## ఏప్రిల్ 1 నుంచి జనగణన

- సహజీవన జంటలకు కుటుంబ హోదా ఇవ్వనున్న కేంద్రం
- 2026 ఏప్రిల్ 1 నుంచి జరగనున్న తొలి దశ జనగణన
- ఈ ప్రక్రియలో అన్ని రకాల ప్రజల సందేహాలను తీర్చడానికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్

### అన్ని నగరాల కంటే హైదరాబాద్‌లోనే

# అధిక ఫీజులు




- ప్రైవేట్ స్కూల్స్ దోపిడీ ఆగేదెన్నడు?
- ఏడాది క్రితమే బిల్లు నమూనా సిద్ధమైనా మల్లగుల్లాలు
- రుసుముల నియంత్రణకు చట్టం చేయాలని విద్యా కమిషన్ సిఫార్సు
- ఈ అసెంబ్లీ సమావేశాల్లోనూ బిల్లు లేనట్లే!
- గత దశాబ్దకాలంగా సర్కారు కేవలం ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో పెట్టడం లేదు



## బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం

- ఎన్నికల్లో కలిసొచ్చే మతపరమైన అంశాలపైనే ప్రధాని మాట్లాడుతారు
- శబరిమలలో ఏం జరిగిందో మోదీ మర్చిపోయారు
- అయ్యప్ప ఆలయం బంగారం స్థానంలో ఇత్తడిని పెట్టారు
- ఎల్‌డీఎఫ్‌తో రహస్య అవగాహన వల్లే మౌనం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

# గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా

- డొమెస్టిక్ రూ.2 వేలు
- కమర్షియల్ రూ.3 వేలు
- కొరత పేరు చెప్పి దోచేస్తున్నారు!
- వరంగల్‌లో గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా
- అక్రమ రవాణా, నల్లబజారు పెరుగుదలతో వినియోగదారులపై తీవ్ర ప్రభావం
- వినియోగదారుల వేదనను తెలియజేస్తున్న వాస్తవ సంఘటనలు



హైదరాబాద్

వరంగల్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా, నల్లబజారు విక్రయాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గ్యాస్ సరఫరాలో లోపాలు, అధికారుల నిర్లక్ష్యం కలిసి ఈ సమస్యను మరింత తీవ్రంగా మారుస్తున్నాయి. సాధారణంగా మార్కెట్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.2,166, గృహ వినియోగ సిలిండర్ ధర రూ.984గా ఉండగా, అక్రమంగా వీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వాణిజ్య సిలిండర్‌ను రూ.3,000 వరకు, గృహ సిలిండర్‌ను రూ.2,000 వరకు అమ్ముతూ కొందరు దందా సాగిస్తున్నారు. ఈ పరిస్థితి సామాన్య వినియోగదారులకు తీవ్రమైన ఆర్థిక భారం అవుతోంది. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత - మిగతా3లో

# నక్సలిజం దాదాపు అంతమైంది

ఆయుధాలను చేపట్టే వారిని కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టబోదని కేంద్రహోంశాఖమంత్రి అమిత్ షా హెచ్చరించారు. నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు. నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. బస్తర్‌లో ప్రతి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశామన్న అమిత్ షా, తెలంగాణలో అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని గుర్తు చేశారు. నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను మార్చామని అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదని విమర్శించారు. ఎన్?డీఏ వచ్చాకే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీ రు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన యువకులకు ఉపాధి కల్పించామని చెప్పారు. నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా తమకు అండగా నిలిచారని వివరించారు. ఎందరో భద్రతా సిబ్బందిని నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారన్న అమిత్ షా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు.

**ప్రాణాలు తీసే హక్కు నక్సల్స్‌కు ఎక్కడిది?**

మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం, రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగులబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరాగాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. సైనిక బలగాలు, పోలీసులు, స్టేషన్లపై దాడి చేసి వాళ్లు ఆయుధాలు దోచుకెళ్లారు. నక్సల్స్ వద్ద ఉన్న వాటిలో 52 శాతం ఆయుధాలు పోలీసుల నుంచి దోచుకెళ్లినవేనని అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నారని, అయితే మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదని, వారు ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా పేర్కొన్నారు. నక్సలైట్లను భగత్‌సింగ్, బిర్సాముండా వంటివారితో పోల్చకూడదన్న ఆయన, ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని, వారికి ఆదర్శం భారతీయులెవరూ కాదని, వారికి మావో ఆదర్శమని అమిత్ షా అన్నారు. ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందిందని ఆరోపించారు. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయని అమిత్ షా నిలదీశారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరా డుతున్నామంటూనే సాయుధ ఉద్యమాలను సమర్థిస్తున్న వారిని నేనొక్కటే అడుగుతున్నాను. మీరు రాజ్యాంగాన్ని గౌర విస్తారా? లేదా? ఎవరికైనా అన్యాయం జరిగితే దానికి పరిష్కా రం మన రాజ్యాంగంలో ఉంది. న్యాయస్థానాలు, శాసనస భలు, జిల్లా పరిషత్తులు, తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థను పూర్తిగా తిరస్కరించి ఆయుధాలను చేతుల్లోకి తీసుకుంటారా? ఎవరైతే వామపక్ష భావాజలాన్ని సమర్థిస్తున్నారో వాళ్లకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. సాయుధ పోరాటాలు చేసే రోజులు పోయాయి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఎవరైనా ఆయుధాలు పట్టుకుంటే వాళ్లని వదిలిపెట్టం. ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించేది లేదు.

**చిన్న పిల్లలకు తుపాకులు**

నక్సల్స్ చిన్నపిల్లలకు తుపాకులు, ఆయుధ సామగ్రి ఇచ్చారని, ఏజెన్సీ ప్రాంతాల యువతీయువకుల జీవితాలను వారు నాశనం అమిత్ షా ఆరోపించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, అందుకు కారణం విద్య, వైద్య, మౌలిక వసతులను నక్సల్స్ ధ్వంసం చేయడమే కారణమని పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్ లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆయన ప్రశ్నించారు.

**చర్చల ద్వారానే పరిష్కారం**

దేనికైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని, తుపాకులతో కాదని అమిత్? షా హితవుపలికారు. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు. మరి హింసను ఎలా సమర్థిస్తారు? కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగింది. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుమార్లు కోరాం. లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. కానీ నక్సల్స్? పలుచోట్ల రైలు బోగీలు తగలబెట్టారు. ప్రజల నుంచి డబ్బు వసూలు చేశారు. అంతేకాదు ప్రభుత్వ పథకాల అమలును కూడా నక్సలైట్లు అడ్డుకున్నారు. నక్సలిజం అభివృద్ధి కోసం రాలేదు. వామపక్ష భావజాల వ్యాప్తి కోసం వచ్చింది. నక్సలిజాన్ని రూపుమాపిన ఘనత కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలదే. మావోయిస్టు పార్టీ చైనా నుంచి వచ్చింది. చైనా నుంచి వచ్చిన పార్టీకి ఇక్కడి ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయి? మావోయిస్టు పార్టీ సిద్ధాంతం దేశాభివృద్ధి కాదు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడమే వారి సిద్ధాంతం. మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతాలు దారుణంగా ఉంటాయి.

**ఎందుకు ఇన్ని వామపక్ష పార్టీలు?**

'మేం వచ్చిన 12 ఏళ్లలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. రష్యాలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాక ఇండియాలో సీపీఐ ఏర్పడింది. సీపీఐ ఏర్పాటు వెనుక రష్యా కమ్యూనిస్టుల హస్తం ఉందన్న వాదన ఉంది. కమ్యూనిస్టులు ఆంగ్లేయులను కూడా సమర్థించారు. సీపీఐ ఉన్నాక మళ్లీ సీపీఐ (ఎం) ఎందుకు ఏర్పడింది? సీపీఐ, సీపీఎం తర్వాత మళ్లీ మావోయిస్టు పార్టీ ఎందుకు ఏర్పాటైంది? 2004లో కొన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై మావోయిస్టు పార్టీ ఏర్పడింది. అయితే నక్సల్స్‌ను సమర్థించేవారికి మానవత్వమే లేదు. నక్సల్స్ లక్షలమంది తల్లులకు గర్భశోకం కలిగించారు' అని అమిత్? షా అన్నారు.

**అంతా కాంగ్రెస్ వల్లే!**

'పేదలకు, పిల్లలకు ఆయుధాలు ఇచ్చినవారు మనుషులే కాదు. సల్వాజుడుం పేరుతో కాంగ్రెస్ పార్టీ అనేక దారుణాలు చేసింది. న్యాయమూర్తిగా పనిచేసిన సుదర్శనరెడ్డి తీర్పును ఖండిస్తున్నాం. జడ్జిలు తమ వ్యక్తిగత సిద్ధాంతాలను వృత్తిలో జోడించకూడదు. మేం వచ్చాక ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ టవర్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాల్లో బ్యాంకులు, పోస్టాఫీసులు ఏర్పాటు చేశాం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు, ఐటీఐలు, విద్యాలయాలు, ఆస్పత్రులు నిర్మించాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పనకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశాం' అని అమిత్? షా పేర్కొన్నారు.

# అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి

అసోంలో ఒకప్పుడు దీర్ఘకాలం అస్థిరత, అశాంతి నెలకొన్నప్పటికీ, గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందని తెలిపారు. ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న అసోంలో 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో హింసతో అల్లకల్లోలమైన అసోం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత పదేళ్లలో నిజాయితీగా అమలు చేసిన శాంతి ఒప్పందాల వల్ల అసోంలో స్థిరత్వం నెలకొన్నట్లు చెప్పారు. యువత భవిష్యత్తు భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.



**కాంగ్రెస్‌పై విమర్శలు**

మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవని మోదీ విమర్శించారు. ఆ ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయని, యువతను నిరాశలోకి నెట్టాయని అన్నారు. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్? పాలనలో తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో చేసుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదని విమర్శించారు.

**మొదటిసారి ఓటర్లకు పిలుపు**

మొదటిసారి ఓటు వేయనున్న యువతకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలన గురించి గుర్తు చేయాలని పార్టీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఏఐ రూపొందించిన వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే అసోంలో ఈసారి కూడా హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోదీ తెలిపారు.

**బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించింది కాంగ్రెస్ : నితిన్ నబీన్**

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశీయులను అసోంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సహకరించిందని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అక్రమ వలసలను నియంత్రించలేదని, దీంతో బంగ్లాదేశీ చొరబాటుదారులు అసోంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చి అక్రమ వలసదారులకు నిష్క్రమణ చూపిస్తున్నామని తెలిపారు. మొరిగావ్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.

**రాహుల్ గాంధీపై నబీన్ విమర్శలు**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోం సంప్రదాయ కండువా గమోచాను ధరించలేదని, ఇది రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసిందని అన్నారు. అదే సమయంలో మసీదులకు వెళ్లినప్పుడు టోపీ ధరిస్తారని ఆరోపించారు.

**'బీజేపీ పాలనలో అభివృద్ధి'**

గత పది సంవత్సరాల్లో బీజేపీ పాలనలో అసోంలో భారీ అభివృద్ధి జరిగిందని నబీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, హింస, పెట్టుబడిదారుల వెనుదిగడం, యువత నిరాశ వంటి సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికలు**

అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఈసారి అసోంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

# బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం

ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించే మాట్లాడే ప్రధాని మోదీ, పాలక్కడ్ ఎన్నికల ప్రసంగంలో శబరిమల అంశంపై మౌనం వహించడం సరికాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి కలిసి పనిచేస్తున్నందు వల్లే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. మతం కంటే రాజకీయాలకు ప్రాధాన్యతను ఇచ్చినందు వల్లే, శబరిమల అంశాన్ని ప్రసంగంలో మోదీ ప్రస్తావించలేదన్నారు. శబరిమలలో ఏం జరిగిందో మర్చిపోయినట్లుగా మోదీ వ్యవహరించారని రాహుల్ విమర్శించారు. అధికార వామపక్ష కూటమి నేతలు అయ్యప్ప ఆలయం బంగారాన్ని స్వాహా చేసి దాని స్థానంలో ఇత్తడిని పెట్టారనే విషయాన్ని ప్రధాని మర్చిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. అయ్యప్ప ఆలయానికి నెలవైన పాలక్కడ్ జిల్లాకు వచ్చినప్పుడు శబరిమల గురించి మాట్లాడకపోవడం సరికాదన్నారు. యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వస్తే అయ్యప్ప ఆలయంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం కేరళలోని పథనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం**

"ఈసారి కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – సీపీఎంలతో కూడిన ద్వయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటోంది. ఈదఫా బీజేపీ పూర్తి మద్దతును కలిగిన వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమితో మేం పోరాడుతున్నాం. ఒక వైపు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఉంది. మరోవైపు సీపీఎం – బీజేపీల ద్వయం ఉంది. ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం దాగి ఉంది. సాధారణంగా రహస్య హస్తం లాంటి కాన్సెప్ట్‌లను మార్కెట్లతో ముడిపడిన ఆర్థికవేత్తలు వినియోగిస్తుంటారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని బీజేపీ కోరుకుంటోంది. ఎందుకంటే జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక రాజకీయ శక్తి కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లతో మేం సైద్ధాంతికంగా పోరాడుతున్నాం. ఎల్‌డీఎఫ్ లాంటి కూటమి కేరళలో అధికారంలో ఉన్నా, తమ నియంత్రణలోనే పని చేస్తుందని బీజేపీ భావిస్తోంది. బీజేపీ నియంత్రణలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉన్నందు వల్లే సీఎం పినరయి విజయన్‌పై ఒక్క కేసూ నమోదు కాలేదు. బీజేపీపై సీఎం పినరయి విజయన్ పల్లెత్తు మాట కూడా అనలేదు. బీజేపీ– ఎల్‌డీఎఫ్ కుమ్మక్కుకు ఇవే నిదర్శనాలు" అని రాహుల్ గాంధీ తెలిపారు.



**కేరళ సీఎంను ఎందుకు టార్గెట్ చేయడం లేదు?**

"కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ దేశంలోని విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దర్యాప్తు సంస్థల ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. అందుకే నాపైనా 36 కేసులను నమోదు చేశారు. నన్ను కంటిన్యూగా 55 గంటల పాటు ప్రశ్నించారు. కానీ కేరళలోని వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి అధినాయకత్వంపై అలాంటి దర్యాప్తుల ఒత్తిడేం లేదు. కేరళ సీఎంను కానీ, అధికార ఎల్‌డీఎఫ్ కూటమి నేతలను కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకో టార్గెట్ చేయడం లేదు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు!**

"నేను ఈ ప్రసంగాన్ని మొదలుపెట్టేటప్పుడే మైక్ వైపు చూశాను. ఇదిగో దానిపై మేడ్ ఇన్ చైనా అని రాసి ఉంది. ఇండియాలో తయారైంది, కేరళలో తయారైంది అని దీనిపై ఎందుకు రాసిలేదు? మేడ్ ఇన్ ఇండియా వస్తువుల తయారీ అనేది లేకుండా మనం కేరళ యువత కోసం ఉద్యోగ అవకాశాలను ఎలా క్రియేట్ చేయగలం? కేరళ భవిష్యత్తును కేవలం 1 లేదా 2 కంపెనీలే కంట్రోల్ చేస్తే, మేడిన్ ఇండియా లక్ష్యాన్ని మనం ఎలా సాకారం చేసుకోగలం? మీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రే ఈ దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వమే కమ్యూనిస్టు భావజాలాన్ని అణచివేస్తోంది. దీంతో అది కార్పొరేట్ ఫండెడ్ ప్రభుత్వంగా మారిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ రాజీకి వచ్చినట్టుగా, నరేంద్రమోదీతో సీఎం పినరయి విజయన్ రాజీకి వచ్చారు. అవినీతి అభియోగాల ద్వారా విజయన్‌ను మోదీ కంట్రోల్ చేస్తున్నారు" అని రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు.

## సైనికులకు న్యాయం సులభంగా అందాలి



దేశ సైనికుల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సీజేఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూ వివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి" అని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

**'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి'**

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (చీూూూూ) కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సీఏపీఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సీజేఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్ బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహా మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. సైనికుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

## ఏప్రిల్ 1 నుంచి జనగణన

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన–2027 ప్రక్రియ మొదటి దశ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా హౌజ్ లిస్టింగ్ – హౌజింగ్ సెన్సస్ (ూూూ)ను నిర్వహించనున్నారు. వివాహం చేసుకోకుండా చాలాకాలంగా కలిసి ఉంటున్న జంటలను ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సహ జీవన జంటలను పెళ్లయిన దంపతులలాగే పరిగణించాలని డిసైడ్ చేసింది. ఈ మేరకు జనగణన నిబంధనల్లో కీలక మార్పులు చేశారు. తొలిసారిగా ప్రజలకు స్వయంగా తమ వివరాలను సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో ప్రజల సందేహాలను తీర్చేందుకు తరుచుగా అడిగే 33 ప్రశ్నల సమాధానాలను ఆ పోర్టల్‌లో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) పొందుపర్చింది. హౌజ్ లిస్టింగ్ – హౌజింగ్ సెన్సస్ సందర్భంగా ఈ 33 ప్రశ్నలనే ప్రజలను ఎన్యుమరేటర్లు అడగనున్నారు.

**జనగణనలో ప్రజలిచ్చే సమాచారాన్ని ఎవ్వరికీ ఇవ్వం : ఆర్‌జీఐ**

ఈ సందర్భంగా సోమవారం రోజు విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ కీలక వివరాలను వెల్లడించారు. జనగణన చట్టం (సెన్సస్ యాక్ట్)లోని సెక్షన్ –15 అనేది అత్యంత కీలకమైందని, దీని ప్రకారం జనగణన వేళ ప్రజలు అందించే సమాచారాన్ని విశ్వసనీయమైనదిగా పరిగణిస్తామని ఆయన తెలిపారు. చివరకు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద కూడా ఆ సమాచారాన్ని తాము బహిర్గతపర్చమని స్పష్టం చేశారు. కోర్టులో రుజువుగానూ ఆ సమాచారాన్ని అందించమని, ఏ ఇతర సంస్థకూ ఈ వివరాలను అందించమని మృత్యుంజయ్ తేల్చి చెప్పారు. జనగణన ప్రక్రియలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో జనగణనను నిర్వహించేందుకు యావత్ పాలనా యంత్రాంగాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వినియోగిస్తాయని పేర్కొన్నారు. చివరిసారిగా మన దేశంలో 2011లో జనగణన జరిగిందని, ఇది భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన అని మృత్యుంజయ్ చెప్పారు.

## నామినేషన్లు దాఖలు చేసిన స్టాలిన్, విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి, ఐవీఖ అధినేత వీఖ స్టాలిన్ చెన్నైలోని కొళత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నామ పత్రాలు దాఖలు చేసే సమయంలో ఆయన వెంట పార్టీ కీలక నేతలు ఉన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత స్టాలిన్ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కొళత్తూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు ముఖ్యమంత్రి స్టాలిన్?. ఒకవైపు పరిపాలన వ్యవహారాలు చూస్తూనే, మరోవైపు పార్టీని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. అయితే, కొళత్తూర్ నుంచి స్టాలిన్ నామినేషన్ వేయడం ఇది నాలుగోసారి. గతంలో మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి బరిలో దిగి ఘన విజయం సాధించారు ముఖ్యమంత్రి స్టాలిన్. నామినేషన్ అనంతరం మాట్లాడిన స్టాలిన్, కొళత్తూర్ ప్రజలు తనకు వరుసగా నాలుగోసారి అఖండ విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు భారీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదివరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే తమకు ఈ సారి ప్రజల్లో అపారమైన మద్దతు కనిపిస్తోందని స్టాలిన్? పేర్కొన్నారు. 'ఈసారి విజయం చాలా గొప్పగా ఉంటుంది. దిల్లీకి తమిళనాడు ఎదురు నిలుస్తుంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

**రెండు స్థానాల్లో పోటీ చేయనున్న టీవీకే అధినేత విజయ్?**

మరోవైపు టీవీకే అధినేత విజయ్ కూడా పెరంబూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సారి ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. మరొకటి తిరుచ్చి ఈస్ట్? నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, నామినేషన్ అనంతరం విజయ్ రోడ్ షో నిర్వహించారు. ఏప్రిల్ 23న జరిగే ఎన్నికల్లో విజిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో డీఎంకే పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ఓ దుష్టశక్తి అని, వారి పాలనలో మహిళలకు భద్రతే లేదని ఆరోపించారు. డీఎంకే నుంచి తమిళనాడును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

# గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా..

-మొదటిపేజీ తరువాయి

సకాలంలో డెలివరీ జరగకపోవడం వినియోగదారులకు పెద్ద సమస్యగా మారింది. బుకింగ్ చేసిన 10 నుంచి 15 రోజులు గడిచినా సిలిండర్ ఇంటికి రాని పరిస్థితులు నెలకొన్నాయి. అత్యవసర సమయంలో కూడా గ్యాస్ అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని అక్రమ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుని, అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నారు.

నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఓ వినియోగదారుడు ఈ నెల 17న హెచ్‌పీ యాప్ ద్వారా గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ, 12 రోజులు గడిచినా ఇప్పటికీ సిలిండర్ అందలేదు. సంబంధిత ఏజెన్సీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదు. పౌర సరఫరాల శాఖ అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు కనిపించలేదు.

అలాగే రెడ్డి కాలనీకి చెందిన మరో వినియోగదారుడు మార్చి 5న భారత్ గ్యాస్ బుక్ చేసుకున్నారు. మార్చి 18న డెలివరీ అయినట్లు సందేశం వచ్చినప్పటికీ, వాస్తవంగా సిలిండర్ అందలేదు. అనుమానం ఏమిటంటే, ఆ సిలిండర్‌ను మరొకరికి అధిక ధరకు విక్రయించినట్లు తెలుస్తోంది. ఏజెన్సీకి, కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా స్పందన లేకపోవడం వినియోగదారుల అసహనాన్ని పెంచుతోంది.

ఏజెన్సీల నిర్లక్ష్యం – అధికారుల అలసత్వం : నగరంలోని కొన్ని గ్యాస్ ఏజెన్సీలకు పరిమితికి మించి కనెక్షన్లు ఉన్నాయని, వాటి నిర్వహణలో లోపాలు ఉన్నాయని స్వయంగా పౌర సరఫరా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అంగీకరిస్తున్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నప్పటికీ, ఆయా ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.



అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నామని చెప్పినా, వాటి ప్రభావం మాత్రం కనిపించడం లేదు.

**నల్లబజారు దందాకు కారణాలు**

గ్యాస్ కొరత పేరుతో కొందరు అక్రమంగా సిలిండర్లను దాచిపెట్టి, అవసరమైనప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం, డెలివరీ వ్యవస్థలో అవినీతి, ఏజెన్సీలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. సాంకేతికంగా బుకింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ, దాని అమలు సక్రమంగా జరగకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

**పరిష్కారానికి అవసరమైన చర్యలు**

ఈ సమస్యను నియంత్రించాలంటే అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరం. అక్రమంగా సిలిండర్లను విక్రయిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి. గ్యాస్ డెలివరీ వ్యవస్థను పారదర్శకంగా మార్చి, ప్రతి బుకింగ్‌కు సంబంధించిన వివరాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలి. ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి. వరంగల్‌లో గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా సామాన్య ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సరఫరా లోపాలు, అధికారుల నిర్లక్ష్యం కలిసి సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకుంటేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.


# అన్ని నగరాల కంటే హైదరాబాద్‌లోనే అధిక ఫీజులు

రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూల్స్ ఇష్టారాజ్యంగా పెంచుతున్న ఫీజులను కట్టడి చేసేందుకు నియంత్రణ చర్యలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. గత దశాబ్దకాలంగా సర్కారు కేవలం ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో పెట్టడం లేదు. ఈ మేరకు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాదిన్నర కాలంగా పాఠశాల ఫీజులు నియంత్రించేందుకు ఓ కమిటీని నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చెబుతూనే ఉంది. ఈ నిబంధనలను అమలులోకి తెచ్చేందుకు బిల్లు సిద్ధమై ఏడాది దాటుతున్నా ఇప్పటికీ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టలేదు. నెల రోజుల కిందటే రుసుముల నియంత్రణ కోసం కమిటీని నియమిస్తామని ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. ఇంతలో మరో రెండున్నర నెలల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇక్కడ విశేషమేంటంటే సీబీఎస్?ఈ, ఐసీఎస్?ఈ బోర్డుల పాఠశాలలైతే ఇప్పటికే సీట్లు కూడా ఖరారు చేసి ఫీజుల వసూలు కూడా ప్రారంభించేశాయి.

**కట్టడిపై సాగదీత ఇలా :**

తెలంగాణలో 2009 ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన జీవో–91 ప్రకారం కలెక్టర్లు ఛైర్మన్?గా ఉండే డీఎఫ్?ఆర్?సీలకు ఫీజులను నియంత్రంచే అధికారం లేదని స్పష్టం చేసింది. దానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమిటీలకు అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు 2016 సెప్టెంబరు 19న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయ మాజీ వీసీ తిరుపతిరావు ఛైర్మన్?గా కమిటీని నియమించింది. ఆ కమిటీ డిసెంబర్? 2017న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రతి ఏడాది 10 శాతానికి మించకుండా పెంచుకోవచ్చని షరతులు విధించింది. ఆ తర్వాత ఎటువంటి పురోగతి జరగడం లేదు. పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిపై అదే సంవత్సరం ఏప్రిల్?లో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ కమిటీ కూడా ప్రతి ఏడాది 10 శాతం పెంచుకోవచ్చని సర్కారుకు సిఫార్సు చేసినా, దానిపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ప్రస్తుత అధికారిక ప్రభుత్వం 2023 డిసెంబరులో




అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజులను నియంత్రించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని 2024 సెప్టెంబరులో ప్రకటించింది.

రాష్ట్ర విద్యా కమిషన్? తెలంగాణ ప్రైవేట్? అన్ ?ఎయిడెడ్? స్కూల్? రెగ్యులేటరీ అండ్? మానిటరింగ్? కమిషన్? ముసాయిదా బిల్?–2025 పేరిట గత ఏడాది జనవరిలో ప్రభుత్వానికి నివేదికనిచ్చింది. ప్రస్తుతం ఆ కమిషన్? తెలంగాణ విద్యా విధానం–2026 పేరిట ఇచ్చిన నివేదికలో పాఠశాలలు, జూనియర్? కళాశాలల్లో ఫీజుల నియంత్రణను కట్టడి చేసేందుకు, చట్టం చేయాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రైవేట్? స్కూల్స్? అండ్? జూనియర్? కాలేజెస్? ఫీ రెగ్యులేటరీ అండ్? మానిటరింగ్? కమిషన్? డ్రాఫ్ట్? బిల్లు–2026ను అందజేసింది.

అత్యధిక ఫీజులు ఎక్కడంటే ? : దాదాపుగా ఎనిమిదిన్నర ఏళ్ల క్రితం నిర్వహించిన ఓ అధ్యయంలో దేశంలోని అన్ని నగరాల కంటే హైదరాబాద్?లోనే ఫీజులు ఎక్కువగా ఉన్నాయని వెల్లడైంది. దీని ఫలితంగా హైదరాబాద్? స్కూల్? పేరెంట్స్? అసోసియేషన్? పేరిట తల్లిదండ్రులు ఓ సంఘాన్ని ఏర్పాటు చేసి, ఫీజుల నియంత్రణ కోసం దశాబ్దాల కాలంగా పోరాడుతున్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్? విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ.1.83 లక్షలు. అదే పాఠశాలల విషయానికి వస్తే దాదాపు రూ.5 లక్షలకు పైగా వసూలు చేసే స్కూళ్లు దాదాపు 10 వరకూ ఉన్నాయి. కొన్ని పాఠశాలలు రుసుములపై నియంత్రణ లేకపోవడంతో 20–30 శాతం కూడా పెంచుతున్నాయి. కొద్ది రోజుల క్రితం పటాన్?చెరు ప్రాంతంలో ఓ పాఠశాల పాఠ్యపుస్తకాల ధరలను రూ.18 వేలకు పెంచింది. అక్కడ తల్లిదండ్రులు నిరసన తెలిపినప్పటికీ అధికారులు దానిని పట్టించుకోలేదు.

# ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ.. మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం

**హైదరాబాద్:** ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా తెలంగాణ శాసనసభలో గందరగోళం తలెత్తింది. భాజపా శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రులంతా గాలిమోటార్లలో గాలి తిరుగుడు తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాఖ్యలు విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. హెలికాప్టర్‌లో తిరిగితే తెలంగాణలో గాలి తిరుగుడే అంటారని మహేశ్వర్‌రెడ్డి సమర్థించుకున్నారు. మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను మంత్రి పొన్నం కూడా తీవ్రంగా ఖండించారు. హెలికాప్టర్‌లో తిరగడాన్ని గాలిమోటార్ అంటా రు కానీ, గాలితిరుగుడు అనడం కరెక్ట్ కాదని, మహేశ్వర్‌రెడ్డి గౌరవప్రదంగా ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో అసలు తప్పేముందని మహేశ్వర్‌రెడ్డి మళ్లీ సమర్థించుకున్నారు. మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ సీరియస్ అయ్యారు. స్పీకర్ కుర్చీని కించపరిచేలా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారని అన్నారు. “ రైతులను మోసం చేసింది మీరు కాదా. రైతు వ్యతిరేక నల్లచట్టాలు తెచ్చింది మీరు. నాలుక కర్చుకొని మళ్లీ వెనక్కి తీసుకుంది కూడా మీరే. తప్పులన్నీ మీరు చేసి.. మమ్మల్ని నిందిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు” అంటూ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు స్పీకర్ సూచనతో.. తన వ్యాఖ్యలు తప్పుగా అర్థమైతే వెనక్కి తీసుకుంటాను అంటూ.. గందరగోళానికి మహేశ్వర్‌రెడ్డి తెరదించారు.



## ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

-మొదటిపేజీ తరువాయి

తీసుకెళ్లారని, అది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందని, రేషన్ బియ్యం పంపిణీపై ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని వివరించారు. నలభై ఏళ్లుగా ఇదే పథకం కొనసాగుతోందని, ఆనాటి నుంచి దొడ్డు బియ్యమే ఇస్తూ వచ్చారని గుర్తు చేశారు. దొడ్డు బియ్యం తినేవారు లేక ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయిందని ఆరోపించారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే అని పేర్కొన్నారు.

**86 శాతం ప్రజలు లబ్ధిపొందుతున్నారు**

దొడ్డు బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్ప, పేదలకు ఉపయోగపడటం లేదని గ్రహించామని, అందుకే పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించామని సీఎం తెలిపారు. ఇందుకోసం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించి సన్నవడ్లు పండించాలని ప్రోత్సహించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని వివరించారు. భవిష్యత్ లో ఇది 90 శాతం కూడా కావచ్చునని పేర్కొన్నారు.

**విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందించాలి**

అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు అందించామని, రైతులకు లాభం చేకూర్చడమే కాదని, పేదల ఆకలి తీరుస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గిందని పౌరసరఫరాల మంత్రి, శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైందని కొనియాడారు. నేటితో సన్నబియ్యం పంపిణీకి ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు అసెంబ్లీలో సన్నబియ్యం భోజనం పెట్టామని అన్నారు. తమ నెక్స్ట్ టార్గెట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందించడమేనని స్పష్టం చేశారు.

**పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి**

అందుకే వరి ఒక్కటే కాదని, ఇతర పంటలను ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

**రావణుడు లేకుంటే రాముడు లేడు**

రావణుడు లేకుంటే రాముడు లేడని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్‌రెడ్డి రావణుడి కంటే మంచి పనులు చేసేవారే రాముడని అభివర్ణించారు. కేసీఆర్ రావణుడా అని సీఎం రేవంత్‌రెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. కేసీఆర్ రావణుడా అనే ప్రశ్నకు అనుమానమెందుకని సీఎం జవాబు ఇచ్చారు. కేసీఆర్‌ను బావాబావమరుదులు ఇంట్లో నిర్బంధించారని వ్యాఖ్యానించారు.

## గిగ్ వర్కర్స్ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

ఈ బిల్లులో వృత్తిపరంగా ఆరోగ్యపరమైన అంశాలు ఉన్నాయి.

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారికి ప్రభుత్వం తరుపున సాయం అందించడం లాంటివి ఉన్నాయి. ఈ బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి ఆధ్వర్యంలో లో గిగ్ వర్కర్స్ చట్టం తేవడం శుభపరిణామం. వారికి వృత్తిపరంగా ఇబ్బంది లేకుండా చట్టం చూసుకుంటుంది. గిగ్ వర్కర్ల బిల్లుపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ ప్రభుత్వం గిగ్ వర్కర్లకి అండగా ఉంటుంది’ అని అన్నారు.

**మతపరమైన విద్వేషాలను రెచ్చగొడితే చర్యలు**

మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు–2026ను ప్రవేశపెట్టింది. ఆ బిల్లును స్పీకర్.. సెలెక్ట్ కమిటీకి రిఫర్ చేశారు. ‘తెలంగాణ విద్వేష పూరిత ప్రసంగాలు, విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు’కు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. మత సామరస్యానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో చేసే పోస్టులతో పాటు అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించేలా చేసే ప్రసంగాలను కట్టడి చేయడానికి ఈ బిల్లును రూపొందించారు.

## దవాఖానాల్లో సూపర్ స్పెషాల్టీ డాక్టర్లు..




**హైదరాబాద్ :** ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రవేశపెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను వైద్య ఆరోగ్య శాఖ రూపొందిస్తోంది. దీని ద్వారా విదేశాల నుండి వచ్చే నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖను పటిష్ఠం చేయటమే కాకుండా.. పేదలకు అంతర్జాతీయ స్థాయి చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తుంది. పేదరోగులకు నిజంగా ఇది తీపి కబురే. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందనుంది. వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ.. విదేశాల్లో స్థిరపడిన ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలోని పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులలో త్వరలో విదేశీ వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రవాస భారతీయులైన నిపుణుల నైపుణ్యాన్ని ఇక్కడి పేద రోగులకు ఉచితంగా అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ వేగంగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తూ.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. చాలామంది విదేశీ డాక్టర్లకు తమ మాతృభూమికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ, సరైన వేదిక లేక వెనుకంజ వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఒక కేంద్రీకృత వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఈ పోర్టల్ ద్వారా వైద్యులు తమ స్పెషలైజేషన్, వారు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండే రోజులు, కేటాయించగలిగే సమయాన్ని నమోదు చేసుకోవచ్చు. వ్యక్తిగత కారణాలతో లేదా వైద్య సదస్సుల కోసం హైదరాబాద్ వచ్చే నిపుణులు, తమ విరామ సమయంలో కొన్ని రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించడం లేదా వైద్య విద్యార్థులకు ‘గెస్ట్ ఫ్యాకల్టీ’గా బోధించడం వంటి సేవలు అందించవచ్చు. హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలకు కేంద్రంగా మారింది. విదేశాలతో పోలిస్తే ఇక్కడ వైద్య ఖర్చులు తక్కువగా ఉండటం, అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉండటంతో విదేశీ రోగులు కూడా హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అంతర్జాతీయ నిపుణులు సేవలు అందించడం ద్వారా, ప్రభుత్వ రంగంలో వైద్య ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. గతంలో విదేశాల్లో పనిచేసిన అనేక మంది నిపుణులు ప్రస్తుతం ఇక్కడి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారు. వారి అనుభవాన్ని ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొనసాగించటం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా దక్కుతుంది. ఈ మేరకు రేవంత్ సర్కార్ ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుంది. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం రూపాయి ఖర్చు లేకుండా అందుతుంది. ఇక హైదరాబాద్ నగరంలో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. ఎల్బీనగర్‌కు మెడికల్ కాలేజీ కేటాయిస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ్మా కీలక ప్రకటన చేశారు. ఇప్పటి వరకు మహేశ్వరం పేరుతో మెడికల్ కాలేజీగా ఉండగా.. ఇక నుంచి ఎల్బీనగర్‌కు కేటాయిస్తున్నట్లు చెప్పారు.

# ఇతరుల కష్టాన్ని తమ ఖాతాలో వేసుకోవడం మానుకోండి

**జల్కే పాండురంగ్ హెచ్చరిక**



**వాస్తవ నేస్తం ఆదిలాబాద్ :** బజార్ హత్నూర్ మండలంలోని పిప్పిరి గ్రామ అభివృద్ధిపై బీఆర్ఎస్ నేతలు నిర్వహించిన ప్రెస్‌మీట్ పూర్తిగా తప్పుడు ప్రచారం మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టే రాజకీయ డ్రామాలకు ఇక ముగింపు పలకాలని ఆయన హెచ్చరించారు. సోమవారం బజార్ హత్నూర్ మండలంలోని పిప్పిరి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇతరులు చేసిన అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకుని గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఇక మాయ మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పిప్పిరి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమై రూపుదిద్దుకున్నవని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాల్స్, అంగన్‌వాడీ భవనాలు వంటి పనులు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఇచ్చిన హామీల ఫలితమని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆ హామీలను అమలు చేస్తున్న సమయంలో, బీఆర్ఎస్ నేతలు వాటిని తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. అదేవిధంగా, పిప్పిరి గ్రామానికి మంజూరు చేసిన నిధులపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి, ప్రతిపాదనలు ఎవరు పంపారు, ఎన్ని నిధులు మంజూరయ్యాయి వంటి అంశాల్లో స్పష్టత ఇవ్వాలని కోరారు. మండలంలోని రైతులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మూడు సంవత్సరాల పాటు సాగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రజల కోసం జరిగిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని అన్నారు. రాబోయే రోజుల్లో నిజమైన అభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని జల్కే పాండురంగ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి భూమన్న, అరే పాండు, బత్తిని కిషన్, దీసి విజేందర్, గణేష్, నాగోరావ్, కొమ్ము శేషిమాల, విట్టల్, సంతోష్ తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర



వాస్తవ నేస్తాం,కోటగిరి : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామానికి చెందిన హనుమాన్ స్వాములు మాలధారణ పూర్తి చేసుకుని, మొక్కులు తీర్చుకునేందుకు జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వాములు, 'జై శ్రీరామ్' నామస్మరణలతో యాత్రను ప్రారంభించారు. గ్రామస్తులు, మహిళలు స్వాములకు మంగళహారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. కఠిన దీక్షతో కాలినడకన వెళ్లి, కొండగట్టు అంజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నట్లు మాలధారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామపెద్దలు యువకులు మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు రాముని బాటలో నడవాలి : కృష్ణ మహారాజ్



వాస్తవ నేస్తం,కోటగిరి : మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో హిందూ విరాట్ సమ్మేళనం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలయోగి విఠల్ కృష్ణ మహారాజ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుండే పిల్లలకు ధర్మాన్ని, సంస్కారాన్ని నేర్పిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భారతదేశంలో ఉన్న వారంతా హిందువులేనని, హిందుత్వం అనేది మన ఉన్నతమైన జీవన విధానమని ఆయన పేర్కొన్నారు. మన దేశం 'వసుధైవ కుటుంబం' అని, ప్రతి ఒక్కరూ రాముడి బాటలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లలకు నిస్వార్థం, దానగుణం, దయ వంటి ఉత్తమ లక్షణాలను తల్లిదండ్రులు నేర్పాలని సూచించారు. యువత సెల్ ఫోన్లు, సోషల్ మీడియా వ్యామోహానికి దూరంగా ఉండి ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలని కోరారు. ఛత్రపతి శివాజీ, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి మహనీయుల వీరగాథలను పిల్లలకు బోధించాలని, లవ్ జిహాద్ వంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సీతారాముల మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, మండల ప్రజా ప్రతినిధి పోల విఠల్ రావు గుప్తా, అయ్యప్ప ఆలయ కమిటీ నిర్వాహకులు, వివిధ గ్రామాల సర్పంచులు, హిందూ సంఘాల నాయకులు, మండల హిందూ వాహిని కమిటీ ప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రఘునాథపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహజ్వాల



**జనగామ :** తమ నేత కడియం శ్రీహరి యెడల పాశవికంగా ప్రవర్తించి, అమానుషమైన రీతిలో అవమానించిన హుజూరాబాద్ ఎమ్మెల్లే పాడి కౌశిక్ రెడ్డిని బీఆరెస్ పార్టీ బహిష్కరించాలని, స్పీకర్ ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని గ్రంథాలయ సంస్థ జనగామ జిల్లా చైర్మన్ మార్జోడు రాంబాబు డిమాండ్ చేశారు. రఘునాథ్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించి పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతు తెలంగాణ అసెంబ్లీలో స్టేషన్ఘన్పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి మీద కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరిపోయేముందు అతిగావెలిగే దీపంలా మిడిసిపడడం కౌసిక్ రెడ్డి రాజకీయ పతనాన్ని సూచిస్తున్నదని ఆయన విమర్శించారు. దళితుల పట్ల దొరల అహంకారాన్ని ప్రదర్శిస్తూ, శాసనసభ సాక్షిగా విషం చిమ్మిన పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి తక్షణమే తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాసంపల్లి లింగాజి, గాదె మహేందర్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం పాష, నామాల బుచ్చయ్య, గొరిగ రవి, కావటీ భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడారి రవి, లోనే రవీందర్, సిద్ధేశ్వర్, తోటకూర రమేష్, బాసుమియా, పోకల శివకుమార్, బొమ్మ వీరస్వామి, అబ్రహం, వల్లాల అశోక్, దేగల రాజశేఖర్, ఈరీహ నాయక్, లోగుంట్ల క్రాంతి, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాకిటి చంద్రారెడ్డి, మోతిలాల్ , రామచందర్ కుంకీస్ ప్రకాష్ రెడ్డి, బాల్రెడ్డి జిల్లా నాయకులు, మండల నాయకులు, స ర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు , కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు



**హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో ఈరోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వట్టినాగులపల్లిలో సతీశ్ షా కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారని మండిపడ్డారు. భూమి ఇవ్వకపోతే సజీవంగా పాతిపెడతామని బాధితులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించిన నిజాయతీ గల పోలీస్ అధికారి అజీబుల్లా ఖాన్‌ను మరుసటి రోజే బదిలీ చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. నిజాం కాలం నాటి భూములను కూడా ఈ జాబితాలోకి చేర్చి, రైతులను భయాందోళనలకు గురిచేసి, భూములు గుంజుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు త్వరలోనే గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్, భూ కుంభకోణాలపై కేవలం సీబీసీఐడీ విచారణ సరిపోదని, వెంటనే సభా సంఘాన్ని (హౌస్ కమిటీ) వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని... పొంగులేటి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీసీఐడీ విచారణ పేరుతో మంత్రిని కాపాడే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ఇదే సమయంలో పోలీసులకు కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. "పాలకుల ఒత్తిడికి లొంగి అక్రమాలకు సహకరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు" అని హెచ్చరించారు. అక్రమాలకు అండగా నిలవవద్దని, ప్రజల పక్షాన ఉండాలని పోలీసులను కోరారు. బాధితుల పేర్లు బయటపెట్టకుండా బీఆర్ఎస్ లీగల్ సెల్ ద్వారా వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఐపీఎల్ (క్రికెట్) బెట్టింగ్.. సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం

**10 మందిపై కేసు నమోదు.. రిమాండ్ కి తరలింపు**



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) బెట్రింగ్ నిర్వహిస్తున్న 10 మందిపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్ కు తరలించడం జరిగిందని ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇచ్చోడ మండలంలోని అడేగామ(కే) జీపీ పరిధిలోని బృందావన్ కాలనీ ప్రాంతంలో ఎంప్లాయిస్ కాలనీ కి చెందిన గొలుసుల విజయ్ అనే వ్యక్తి ఇచ్చోడ లోని తన స్నేహితులైనా దండుగుల మురళి, జాదవ్ రాము, కాంబ్లే ఆకాష్, సీడం రవి, కాంబ్లే రాజ్‌కుమార్, కాంబ్లే అరుణ్, దాసన్న దేవాల, కాంబ్లే శశి కుమార్, సీపెల్లి శ్రీనివాస్ అను వ్యక్తులు చిట్టీల రూపంలో ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ముందస్తు సమాచారం అందడంతో ఇచ్చోడ పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని బెట్టింగ్ నిర్వహిస్తున్న విజయ్, అతనితో పాటు బెట్టింగ్ లో పాల్గొన్న వ్యక్తులను పట్టుకుని అదుపు లోకి తీసుకున్నారు. పంచనామా నిర్వహించి 3 మోటార్ సైకిల్లు, 9 మొబైల్ ఫోన్లు, రూ. 4470 నగదు స్వాధీనం చేసుకుని వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారిపై కేసు నమోదు, రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. దేశంలో ఐపీఎల్ క్రికెట్ కొనసాగుతున్న నేపథ్యంలో అమాయకపు ప్రజలను మోసం చేసి ఎలాగైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో చిట్టీల రూపం లో గాని, ఎన్ లైన్ లో గాని, బెట్టింగ్ అప్స్ రూపం లో గానీ మరి ఏవైనా ఇతర విధంగా బెట్టింగ్ నిర్వహిస్తే చట్ట పరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## నిమ్మల ఆశ రెడ్డి స్మారకార్థంగా చలివేంద్రం ప్రారంభం



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రంలో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ నిమ్మల శివకుమార్ రెడ్డి వారి తండ్రి స్వర్గీయ నిమ్మల ఆశ రెడ్డి స్మారకార్థంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జలై జాకు, ఉప సర్పంచ్ లోక శిరీష్ కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ ఏర్పాట్లు చేయడం అభినందనీయం అని తెలిపారు. స్వర్గీయ నిమ్మల ఆశ రెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన స్మారకార్థంగా చేపట్టిన ఈ కార్యక్రమం సమాజానికి ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, ఈఓ సురేష్, పోస్టల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## గోనలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



**వాస్తవ నేస్తం భీంపూర్:** మండలంలోని గోన గ్రామంలో గత రెండు వారాలుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. సర్వజనిక్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 50 కి పైగా జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో మహారాష్ట్ర కి చెందిన తైమూర్ 11 గొండ్ వాడ్స, అర్లి(టీ) జట్లు పాల్గొనగా హోరాహోరీగా జరిగిన పోరులో మహారాష్ట్రకు చెందిన తైమూర్ 11 గొండ్ వాడ్స జట్టు గెలుపొందింది. మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12 వేలు,మూడవ స్థానంలో నిలిచిన కామట్వాడ జట్టుకు రూ.7 వేలు,నాలుగవ,ఐదవ స్థానంలో మార్కగూడ,గోన జట్లకు రూ.5 వేలు దాతలు సర్పంచ్ మాడావి కమల, భీమ్రావ్,ఉపసర్పంచ్ ముశ్రాన్ అహ్మద్,స్వామి, తస్వీర్ అహ్మద్, గెడం బాలేరావు లు అందజేశారు.. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సిడం అరవింద్,తొడ్సం హనుమంతు, అశోక్,సోనూ, కర్ణు,గ్రామ పెద్దలు తొడ్సం నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## కల్లూర్ గ్రామంలో వైభవంగా అఖండ హరినామ సప్తహ



**వాస్తవ నేస్తం,కోటగిరి:** పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తహ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలందరికీ భారీ స్థాయిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల భజన కీర్తనలతో గ్రామం మారుమోగుతోంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com